క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని సాయిబాబా ఆలయం ఏరియాలో అభాగ్యులకు శ్రీనివాస్–సుధ దంపతులు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత పెరుగుతుండడంతో రోడ్డుపై ఉండే అభాగ్యులకు ఇబ్బంది కలుగకూడదనే మంచి మనసుతో సొంత ఖర్చులతో దుప్పట్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

నోట్‌బుక్స్..



జనగామ రూరల్: లయన్స్ క్లబ్ పూర్వ జోన్ చైర్మెన్ కర్రె కృష్ణ పుట్టిన రోజు పురస్కరించుకుని పట్టణంలోని వీవర్స్‌కాలనీ ఎంపీపీఎస్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ జనగామ మిలీనియం అధ్యక్షుడు గాదె నర్సింహులు ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, ఫజ్జూరి జయహరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన అధికారులను తొలగించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



జనగామ రూరల్: చాకలి ఐలమ్మ సమైక్య నుంచి భూ కొనుగోలులో అవినీతికి పాల్పడిన అధికారులను సర్వీస్ నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ నేతృత్వంలో కలెక్టరేట్ ఎదుట మహిళా సంఘాల సభ్యులతో ధర్నా నిర్వహించారు. ధర్నాలో రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఈర్రి అహల్య, బూడిది గోపి, సుంచు విజేందర్, పొత్తుకునూరి ఉపేందర్ ,బోడ నరేందర్, ఎండి అజారుద్దీన్ మునిగల రమేష్, వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం, పందిళ్ళ కళ్యాణి, పల్లె లలిత, బూడిది అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి

రఘునాథపల్లి: సేవలతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కూరెళ్ల ఉపేందర్ అన్నారు. గురువారం లయన్ రీజియన్ చైర్మన్ చందుపట్ల రవీందర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని క్లబ్ అధ్యక్షుడు కందుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి కరిమికొండ ప్రదీప్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ కమలహాసన్, విష్ణువర్ధన్‌రెడ్డి, పాండారి పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో గురువారం హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాధ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా క్రమం తప్పకుండా మందులు వాడిన హెచ్ఐవీ పేషెంట్లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఏఆర్‌టీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, ఏఆర్‌టీ డాక్టర్లు సెలీనా, సంతోష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నివాళి



జనగామ రూరల్: కల్లుగీత కార్మిక సంఘం జిల్లా గౌరవ సలహాదారుడు, పట్టణ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, గోపా వ్యవస్థాపక సభ్యుడు పాముకుంట్ల పెద్ద యాదగిరిగౌడ్ (82) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గౌడ సంఘాల నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయనకు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో మధు, సుధాకర్, సంతోష్ కుమార్, కన్న పరశురాములు, కుర్రేముల యాదగిరి, బూడిది గోపి, బాల్నె వెంకటమల్లయ్య, మేకపోతుల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సిగ్నల్ అందక ఇబ్బందులు

● సెల్ టవర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

తరిగొప్పుల: సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిపోయింది. కూర్చున్న చోటు నుంచే ప్రపంచంలో ఏం జరుగుతోంది అనేది సందర్శిస్తున్నాం. ఇటువంటి పరిస్థితుల్లోనూ మండలంలోని జాలుబాయితండా గ్రామస్తులు సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సరిగా పనిచేయక చాలా అవస్థలు పడుతున్నారు. గ్రామం ఏర్పడి దశాబ్దాలు పైగానే కావస్తోంది. గ్రామ స్థాయి నుంచి గ్రామపంచాయతీ స్థాయికి చేరింది. గ్రామంలో 120 గిరిజన కుటుంబాలు ఉండగా. 500 పైగా జనాభా ఉంది. అయినప్పటికీ గ్రామస్తులు సెల్ ఫోన్ సిగ్నల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఏ నెట్ వర్క్ టవర్ సమీపంలో లేకపోవడంతో గ్రామంలో సిగ్నల్ ఏమాత్రం అందడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వాట్సప్‌లో ఏదైనా సమాచారం చేరవేయాలన్నా తప్పక బిల్డింగ్ ఎక్కాలంటున్నారు. ఒక్కోసారి బిల్డింగ్ ఎక్కినా ప్రయోజనం ఉండడం లేదంటున్నారు. ఎవరితోనైనా అత్యవసరంగా మాట్లాడాలంటే గ్రామం శివారుకు ఎత్తైన ప్రదేశానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రాణాల మీదకొచ్చిన సందర్భాల్లో తమ అవస్థలు చెప్పుకోకూడదంటున్నారు. అంబులెన్సుకు సమాచారం ఇచ్చేందుకూ వీలులేని పరిస్థితులు నెలకొన్నట్లు చెబుతున్నారు.



గ్రామపంచాయతీ కార్యాలయం

పలు మార్లు వినతి పత్రాలు అందించాం



గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్ అందక ఉద్యోగపరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని పలు మార్లు పలు నెట్‌వర్ కంపెనీలకు గ్రామపంచాయతీ తరఫున వినతిపత్రాలు అందించాం. హరితహారం మొక్కలు నాటడం, జియో ట్యాగింగ్ చేయడం, చేసిన పని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం చాలా ఇబ్బందిగా ఉంది. సెల్‌ఫోన్ సిగ్నల్ కోసం కిలో మీటర్ దూరం రావాల్సి వస్తోంది.

\- భూక్య రాజేందర్, పంచాయతీ కార్యదర్శి

టవర్ ఏర్పాటు చేయాలి



సెల్‌ఫోన్ సిగ్నల్ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం చేరవేయాలన్నా, తెలుసుకోవాలన్నా చాలా అవస్థలు పడుతున్నాం. గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలి.

\- భూక్యా రవి, గ్రామస్తుడు

దివ్యాంగులు రాణించారు

● ఎంఈఓ నెల్లుట్ల జానకి

తరిగొప్పుల: ప్రస్తుత పరిస్థితుల్లో దివ్యాంగులు అందరిలాగే ముందున్నారని, ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణిస్తూ విజయాలు సాధిస్తున్నారని మండల విద్యాధికారి నెల్లుట్ల జానకి, జిల్లా సమ్మిళిత విద్య కో ఆర్డినేటర్ బొనగిరి నర్సింహారావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో మార్పునకు నాంది పలకాలని, సదరన్ సర్టిఫికెట్లను పొంది ప్రభుత్వం అందించే సౌకర్యాలను ప్రతీ ఒక్కరూ పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బానోతు రవీందర్,స్పెషల్ ఎడ్యుకేటర్ గోపగోని సంధ్య,ఐఈఆర్పీ శివగారి కరుణ, కేర్ గీవర్ జన్నమైన రేణుక, పాలెపు విజయ,మచ్చ చిరంజీవులు, పద్మ, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పుల: బహుమతులు అందజేస్తున్న అతిథులు

భవిత సెంటర్‌ను వినియోగించుకోవాలి

చిల్పూరు: భవిత సెంటర్ ద్వారా ప్రభుత్వం అందించే సేవలను దివ్యాంగులు వినియోగించుకోవాలని సీఎంఓ నర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం ఎంఈఓ దాసరి గోవర్ధన్ అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు కావాల్సిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంలు శ్రీనివాస్, చింతల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరి

● ఏఈ పాము సుధాకర్

నర్మెట: రైతులు తమ వ్యవసాయ మోటార్లకున్న ఆటో స్టార్టర్లను తొలగించి 3 కేవీఏఆర్ కెపాసిటర్లను బిగించాలని ఏఈ పాము సుధాకర్ అన్నారు. రైతు పొలంబాట కార్యక్రమంలో భాగంగా హన్మంతాపురంలో గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెపాసిటర్లు బిగించడంవలన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణగా ఉంటుందని, విద్యుత్ కూడా ఆదా అవడంతోపాటు అంతరాయాలు ఏర్పడవని తెలిపారు. స్టార్టర్లను ఇనుము కాకుండా ప్లాస్టిక్ డబ్బాల్లో ఏర్పాటు చేసుకోవాలని విద్యుదాఘాతానికి గురికాకుండా రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఏ జనగాం రాజవర్ధన్ రెడ్డి, ఎల్ఐ బాలు, జేఎల్ఎం హేమంత్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న సుధాకర్

పశు వైద్యశిబిరం



చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి ముడిక అనేష్ మాట్లాడుతూ పశువులకు లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడ దూడలు మాత్రమే పుడుతాయన్నారు. దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించి రైతులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ అధ్యక్షుడు సాదం రమేశ్, సిబ్బంది రమేశ్, ఫయాజ్, గోపాల మిత్ర ఆయాస్, రమణాచారి, జగ్గుమల్, భిక్షపతి, రాజేష్, పశువైద్య సిబ్బంది నాగరాజు, రైతులు ఆగులు, ఆగయ్య, లింగయ్య, బొందయ్య, లక్ష్మయ్య, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేయాలి



ఎమ్మెల్యేతో నాయకులు

చిల్పూరు: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ముమ్మర ప్రచారం చేయాల్సిన బాధ్యత నూతనంగా గెలుపొందిన యూత్ కాంగ్రెస్ నాయకులపై ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడిగా చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన ఇల్లందుల విజయ్, మండల అధ్యక్షుడిగా పల్లగుట్ట గ్రామానికి చెందిన ఇసురం కృష్ణ ఎన్నిక కాగా గురువారం చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సవందర్భంగా వారికి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, నాగరాజు, రంజిత్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్‌పాల్, కిట్టు, ఆనందం, రత్నకర్‌రెడ్డి ఉన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి



పాలకుర్తి: గ్రామ పంచాయతీ పరిధిలోని ఏసిరెడ్డి నగర్‌లో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాయకులు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మడి రాజుల సాంబయ్య, జీడి సోమన్న, గాయాల బాబు, కాలనీ వాసులు షేరు మల్లమ్మ, యాదగిరి, ఉప్పలమ్మ, సత్తమ్మ తదితరులు ఉన్నారు.

కూలీల సంక్షేమమే ధ్యేయం

● డీఆర్‌పీ బానోత్ కమల

బచ్చన్నపేట: కూలీల సంక్షేమమే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ధ్యేయమని డీఆర్‌పీ బానోత్ కమల అన్నారు. గురువారం మండలంలోని అలింపూర్ గ్రామంలో జీపీ కార్యాలయం వద్ద ఈజీఎస్ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023–24వ సంవత్సరానికి గ్రామంలో చేసిన ఈజీఎస్ పనుల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ కర్ణాకర్, పంచాయతీ కార్యదర్శి రేవతి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్, కారోబార్ మురళి గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమల

బాధిత కుటుంబాలకు సాయం



లింగాలఘణపురం: ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న స్నేహితులు

లింగాలఘణపురం: మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన ఈరటి రాజేశ్వరి ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందగా గురువారం 2006–2007 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆ నిరుపేద కుటుంబానికి రూ.60వేల సాయం అందజేశారు. రాజేశ్వరికి ముగ్గురు ఆడ పిల్లలు ఉండగా వారి పేర్లతో రాజేశ్వరి భర్త బాలకృష్ణ సమక్షంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు తొట్టె బాలరాజు, కొండబోయిన మాధవి, ఎస్.పుష్పలత, ఎల్.రేణుక, ఎస్. శివకృష్ణ, కె.లవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మిత్రుల చేయూత



నర్మెట: ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

నర్మెట: గాదెర అరుణ్ కుమార్ (35) అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా ఎస్ఎస్‌సీ 2003–04 బ్యాచ్‌కు చెందిన మిత్రులు గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 35 వేల సాయం అందించి స్నేహ హస్తాన్ని అందించారు. పరామర్శించిన వారిలో కాసాని ఆంజనేయులు, ప్రజ్ఞాపురం రాజేష్, కూరపాటి శ్రీనివాస్, ఎనుగుల చిరంజీవి, ప్రజ్ఞాపురం శ్రీనివాస్, మారపాక రవి, ప్రజ్ఞాపురం అంజనేయులు, గోవర్ధన్, ప్రజ్ఞాపురం శేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన కుందారపు లావణ్య, రవి దంపతుల కూతురు మానస వివాహానికి సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేల సాయం అందజేశారు.

వరి పొలాల సంరక్షణకు పాటుపడాలి



దేవరుప్పుల: మాట్లాడుతున్న ఏఓ దివ్య

● వ్యవసాయ అధికారి బి. దివ్య

దేవరుప్పుల: వరి పంట కోసిన పొలాలను సంరక్షించుకునేందుకు రైతులు పాటుపడాలని వ్యవసాయ అధికారి బజ్జూరి దివ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఈఓ అధ్యక్షతన ప్రపంచ మృత్తిక దినోత్సవం పురస్కరించుకుని వరి పంట సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు వరి పంట కోసిన తర్వాత వరి కొయ్యలు కల్చకూడదన్నారు. వరిసాగు పొలాల్లో .తప్పనిసరిగా పంట మార్పిడి చేసీ పచ్చిరొట్ట ఎరువులు వేయాలన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు.పలువురు రైతుల సందేహాలకు నివృత్తి చేశారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న నజీరుద్దీన్

భూసార పరీక్షలతో రైతులకు లాభాలు

చిల్పూరు: భూసార పరీక్షల ద్వారా రైతులకు ఎన్నో లాభాలున్నాయని, ప్రతీ రైతు దీన్ని పాటించాలని వ్యవసాయ శాఖ ఏఓ నజీరుద్దీన్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గురువారం మృత్తిక దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ బూర్ల నర్సింహులు, రైతు నేస్తం కేశిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, గుర్రాల వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాదిరెడ్డి మోహన్‌రెడ్డి, పుల్ల అశోక్, కట్ట రవి, సంపత్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


వేలం వాయిదా

పాలకుర్తిటౌన్: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే లైసెన్సు కోసం గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. పాటకు సరైన వేలం రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఈఓ మోహన్‌బాబు తెలిపారు. త్వరలో తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మీ, సూపరింటెండెంట్ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాదచారుడిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

పాలకుర్తిటౌన్: రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న వృద్ధుడిని ద్విచక్ర వాహనం ఢీకొట్టి గాయపర్చిన ఘటన మండల పరిధిలో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దర్దెపల్లి గ్రామానికి చెందిన పల్లె మనోహర్ అనే వృద్ధుడు వేకువ జామున నడుస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడి కాలు విరిగింది. క్షతగాత్రుడిని స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపారు.

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన గాదె సుధాకర్‌ను నియమించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో సుధాకర్ గురువారం విలేకరులతో మాట్లాడారు. మాదిగ జాతి ఐక్యత కోసం, మాదిగల హక్కుల సాధన కోసం ఏర్పడిన మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేస్తూ మాదిగలను ఒకేతాటిపైకి తీసుకువచ్చేలా అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా అబ్బాస్




లింగాలఘణపురం: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వడిచర్లకు చెందిన ఎండీ అబ్బాస్, అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన బొట్ల మనోహర్ అలియాస్ మధు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో జరిగిన ఎన్నికల్లో తమను ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని, అదేవిధంగా మండలంలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని అన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ అధ్యక్షుడిగా శివచరణ్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన రాపోలు శివచరణ్‌రెడ్డి గెలుపొందారు. యూత్‌కాంగ్రెస్ ఎన్నికల్లో 1800 పైచిలుకు మెజార్టీతో మండల అధ్యక్షుడిగా భారీ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా, నియోజకవర్గ, మండల కాంగ్రెస్ పార్టీ, యూత్‌కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

ఏఐవైఎం యూత్ అధ్యక్షుడిగా లింగయ్య



పాలకుర్తిటౌన్: ఆల్ ఇండియా యాదవ మహాసభ యువజన విభాగం మండల అధ్యక్షునిగా మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన శీల లింగయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ జిల్లా అధ్యక్షుడు బనుక సిద్ధరాజ్ యాదవ్ ప్రకటించారు. మండల ప్రధాన కార్యదర్శిగా గూడూరు వాస్తవ్యుడు బెల్లి సతీష్ యాదవ్ నియమితులయ్యారు. నియామకానికి సహకరించిన జిల్లా నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నిక



తరిగొప్పుల: యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలకేంద్రానికి చెందిన ఏడెల్లి శ్రావణ్‌రెడ్డి ఎన్నికయ్యాడు. ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్‌లో అత్యధిక ఓట్లు నమోదు కాగా శ్రావణ్‌రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా గురువారం ప్రకటించారు.నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి యువతను పార్టీకి వెన్నుముకలా ఉండేలా ముందుండి నడిపిస్తానని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మహాసభలను విజయవంతం చేయండి

పాలకుర్తి: ఈ నెల 27,28 తేదీల్లో స్టేషన్‌ఘణపూర్‌లో చేపట్టనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు రమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పాలకుర్తిలో రైతాంగ సాయుధ పోరాటయోధురాలు చిట్యాల ఐలమ్మ స్మారక భవనం ఆవరణలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, బెల్లి సంపత్, ముస్కు ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

దళితుల భూమిని కాపాడాలి

జనగామ రూరల్: మండంలోని యశ్వాంతాపూర్‌లోని దళితుల అసైన్మెంట్ భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలని గ్రామ దళిత రైతులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి వినతిపత్రం అందజేశారు. బొట్ల మహేష్, నర్సయ్య, ఉప్పలయ్య, యాదగిరి, కృష్ణ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ వర్ధంతి సభను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 6న ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సభను రాజకీయ పార్టీలకు అతీతంగా అంబేద్కర్ వాదులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఐక్య వేదిక నాయకులు జీడి రమేష్‌కుమార్ కోరారు. ఘన్‌పూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీరస్తు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సదస్సుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బంద్‌ను..

జఫర్‌గఢ్: ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు పులి ధనుంజయగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఫ్రీ బస్సు సర్వీస్‌తో డ్రైవర్లకు ఉపాధి కరువయిందన్నారు.

కేజీబీవీని సందర్శించిన బీఆర్‌ఎస్‌వీ నాయకులు


లింగాలఘణపురం: బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన గురుకులాల సందర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.చందు ఆధ్వర్యంలో మండలంలోని కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడమే కాకుండా మెను ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అనే వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కరుణాకర్, శ్రీహరి, భాగ్యలక్ష్మి, రాహుల్, మహేశ్, చందు ఉన్నారు.

సన్మానం



రఘునాథపల్లి: రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ట్రెయినీ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కందుకూరి సోనిని గురువారం కల్లు గీత కార్మిక సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గీత కార్మిక సంఘం నాయకులు ఎస్సై సోనికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. జోన్నగోని శ్రీనివాస్, బండపల్లి శంకరయ్య, బాల్నె భిక్షపతిగౌడ్, బుర్ర లక్ష్మీనారాయణగౌడ్, బాల్నె రాజయ్యగౌడ్, కుర్ర రాజుగౌడ్, మహేందర్ పాల్గొన్నారు.

పరామర్శ



నర్మెట: మండలకేంద్రానికి చెందిన గాదెర అరుణ్, బండ ఎల్లేష్, నిమ్మకంటి బుచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందారు. కాగా డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులను అందజేశారు. పరామర్శించిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శి వలబోజు శ్రీనివాస్, తాజామాజీ ఎంపీటీసీ కళ్యాణం మురళి, చేర్యాల మార్కెట్ కమిటి డైరెక్టర్ యసర్ల అంజయ్య, టౌన్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, యూత్ ఉపాధ్యక్షులు శివరాత్రి మహేష్, గొట్టె రాజశేఖర్, కొన్నె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పాడికౌశిక్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వాటిని గుర్తు చేసిన నాయకులను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నరేందర్, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


గోవుల పట్టివేత

కొడకండ్ల: కొడకండ్ల మండలం వెలిశాల శివారు నుంచి లారీలో అక్రమంగా తరలిస్తున్న గోవులను గురువారం సాయంత్రం స్థానికులు పట్టుకున్నారు. వెలిశాల నుంచి సంగారెడ్డికి 36 గోవులను లారీలో కవర్ కప్పి తీసుకెళ్తుండగా స్థానికులు అనుమానం వచ్చి పట్టుకుని స్థానిక పోలీసులకు సమాచారం అందించి అప్పగించగా విచారణ చేస్తున్నారు.

సంబురాల్లో పాల్గొనాలి

బచ్చన్నపేట: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించే సంబురాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సంబురాలను శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జీపీ సిబ్బంది పేర్లు నమోదు చేయాలి



జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలంగాణ జీపీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డీపీఓ స్వరూపకు వినతి పత్రం అందజేశారు.